అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: ఎస్సీ వర్గీకరణ తీర్పుపై శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ 30 ఏళ్ళ వర్గీకరణ సమస్య పరిష్కారం కావడం సంతోషం అన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరణ తీర్పుపై హర్షం

మియాపూర్: వర్గీకరణ తీర్పుపై ఎంసీపీఐయూ మియాపూర్ డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ గ్రేటర్ నాయకులు రంగస్వామి, లక్ష్మి, డివిజన్ నాయకులు నర్సింహ, లలిత, శివాని, జయలక్ష్మి, అరుణ, గౌసియాబేగం పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: మందకృష్ణ మాదిగ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు వచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పట్లోళ్ల వెంకటేష్ మాదిగ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, డప్పు యాదయ్య, నీరుడి రఘు, బాలేష్, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్ కార్యాలయం వద్ద ఆందోళన



వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

మాదాపూర్: నీటిసమస్యను తీర్చాలని మాదాపూర్ సాయినగర్ కాలనీవాసులు వాటర్‌వర్క్స్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు గంగుల రాధాకృష్ణయాదవ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు. మేనేజర్ యాదగిరి మాట్లాడుతూ కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు. బస్తీవాసులు నర్సింహ, సుబాని, ఆనంద్, శివ, కుమార్ స్వరూప, నాగేశ్వరరావు, లక్ష్మణ్, గోపాల్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు.

స్టాక్ మార్కెట్ పేరిట సైబర్ మోసం

రూ.66 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. స్టాక్ మార్కెట్ పేరిట ఓ ఉద్యోగికి బురిడీ వేసి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి జూన్ 18 వ తేదీన వాట్సప్ ద్వారా స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. దీంతో అతడు తన వివరాలను నమోదు చేయడంతో అపరిచిత స్టాక్ మార్కెట్ నిర్వాహకులు ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. అతను నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన పెట్టుబడి, లాభాలు చూపిస్తూ వచ్చారు. మొత్తం రూ.66 లక్షల 75 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తదనంతరం బాధితుడు తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించ లేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, శుక్రవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రుణాల పేరిట మోసం.. నిందితులు అరెస్ట్

మాదాపూర్: రుణం ఇప్పిస్తామంటూ వ్యాపారులను మోసం చేసిన నిందితులను అరెస్ట్ చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్నోకు చెందిన మహమ్మద్ సద్దాం అన్సారీ కేఫ్ వ్యాపారం చేస్తూ అక్కడ నష్టపోయాడు. దీంతో చెడు అలవాట్లకు బానిసయ్యాడు. వ్యాపారస్తులకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి సులువుగా డబ్బులు సంపాదించవచ్చని పథకం పన్నాడు. మరో 12 మందితో కలసి ముంబైలో ఖరీదైన భవనాన్ని అద్దెకు తీసుకొని ఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. మాదాపూర్ కాకతీయహిల్స్‌కు చెందిన కొడాలి శ్రీకాంత్ చౌదరి వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో అన్సారీని కలిశాడు. రూ. 150 కోట్లు వ్యాపారానికి కావాలని అడగ్గా, అంత మొత్తంలో డబ్బు ఇవ్వాలంటే ముందు మధ్యవర్తులకు కొంత సొమ్ము ఇవ్వాలని శ్రీకాంత్ నుంచి రూ.1.5 కోట్లు తీసుకున్నాడు. తర్వాత ఎలాంటి సమాచారం లేకపోవడంతో బాధితుడు మోసపోయినట్టు తెలుసుకొని ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నిందితుల ఆచూకీ కనుగొన్నారు. వారి నుంచి 9 మొబైల్ ఫోన్‌లు, రెండు ల్యాప్ టాప్‌లు, 18 చెక్‌బుక్‌లు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆరు బయట నిమిషం నిలబడలేరు..

ప్రబలిన దోమలు.. విషజ్వరాల బారిన ప్రజలు ● పట్టించుకోని ఎంటమాలజీ అధికారులు

దోమల బెడదతో ప్రజలు అనారోగ్యంపాలవుతున్నారు. దోమలు ప్రబలడంతో కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే చాలు బహిరంగ ప్రదేశాల్లో నిమిషం కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. పరిసరాల అపరిశుభ్రత, చెత్తా చెదారం తొలగించకపోవటంతో పాటు స్థానికంగా ఉన్న చెరువుల్లో గుర్రపుడెక్క టన్నుల కొద్దీ పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి.



అంబీర్ చెరువులో అలుముకున్న గుర్రపుడెక్క

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కేపీహెచ్‌బీ డివిజన్‌లలో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్నారు. చాలీచాలని జీతాలతో ఆసుపత్రులకు తిరగలేక, చికిత్స పొందే స్థోమత లేక సతమతమవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువుల్లోని గుర్రపుడెక్కను తొలగించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల పరిధిలో ఎంటమాలజీ సిబ్బంది అలసత్వం కారణంగా దోమలు వృద్ధి చెంది విష జ్వరాలతో బాధపడుతున్నారు. దోమల నివారణలో కీలకమైన ఎంటమాలజీ విభాగం పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంటమాలజీ ఆధ్వర్యంలో సర్కిళ్ల పరిధిలో డివిజన్‌ల వారీగా కొన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ క్షేత్రస్థాయిలో సరైన చర్యలు తీసుకోవటం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రతి కాలనీ, బస్తీల్లో, నాలాల వెంట, చెరువుల్లో, కుంటల్లో గుర్రపుడెక్కతో పాటు చెత్తా చెదారం వేయకుండా పర్యవేక్షిస్తూ దోమల నివారణకు డ్రైనేజీ, గుంతల్లోనూ స్ప్రే చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. సాయంత్రం వేళల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఎంటమాలజీ సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోకపోవటం వల్లే దోమలు ప్రబలాయని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.

ఫాగింగ్ చేయడం లేదు



దోమల నివారణకు ఎంటమాలజీ సిబ్బంది నెలకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయటం లేదు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ లోపించింది. దోమల బెడదతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఫోన్ ద్వారా ఎంటమాలజీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. కనీసం ఫాగింగ్, దోమల నివారణకు స్ప్రే చల్లాలి.

– భాస్కర్‌రెడ్డి, సప్తగిరి కాలనీ, కూకట్‌పల్లి

వర్షాలతో అంతరాయం..

వర్షాలు కురుస్తుండడంతో ఫాగింగ్, దోమల మందు స్ప్రే కార్యక్రమాలకు అంతరాయం కలిగింది. నేటి నుంచి మందు స్ప్రే, ఫాగింగ్ చేయిస్తాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నాం. చెరువులలో గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమాన్ని కూడా త్వరలోనే చేపడతాం. కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

–సంధ్య, ఎంటమాలజీ సీనియర్ అధికారి, జీహెచ్‌ఎంసీ, కూకట్‌పల్లి

బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠం

మాదాపూర్: శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్ ,చైల్డ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలలో పోషకాలు ఉంటాయని , బిడ్డ మానసిక ఎదుగుదలకు తోడ్పతుందని తెలిపారు. తల్లిపాలు తాగే పిల్లలు అధికబరువు, ఊబకాయం, మధుమేహం వచ్చే అవకాశం తక్కువ అని తెలిపారు. కొంతమంది ఆరోగ్య సమస్యల వల్ల తల్లిపాలను ఇవ్వలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జనార్దన్‌రెడ్డి, బి.రాధిక, మధుసూదన్‌రెడ్డి, ఆశిష్‌సప్రె, యం.నవిత, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అరుణజ్యోతి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే చిన్నారులకు తల్లి పాలు ఇస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. తల్లీ బిడ్డకు పాలు, గుడ్లు అంగన్‌వాడీలో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్‌నగర్ అంగన్‌వాడీ టీచర్ జి.అరుణజ్యోతి, ఆశా వర్కర్స్, ఆర్పీలు పాల్గొన్నారు.



మెడికవర్ ఆస్పత్రి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన వైద్య సిబ్బంది

కులగణన ప్రాముఖ్యతను గుర్తించాలి

రాయదుర్గం: ఎప్పటిలాగానే మత రాజకీయాలతో గెలుస్తామని భావించిన బీజేపీకి ఈసారి ఎన్నికలు చెంపపెట్టు అని హెచ్‌సీయూ ప్రొఫెసర్ తన్వీర్ ఫజల్ అన్నారు. హెచ్‌సీయూలో ఎస్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో జనరల్ ఎలక్షన్స్–2024 : ఇంప్లికేషన్స్ ఫర్ ఇండియన్ డెమొక్రసీ' అనే అంశంపై ప్రత్యేక ప్యానెల్ డిస్కషన్‌ను గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కులగణన ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు. హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ కైలాష్ మాట్లాడుతూ కేంద్రంలో ప్రాంతీయ పార్టీలకు కూడా స్థానం లభించిందన్నారు. అనంతరం వ్యవసాయ చట్టాల అమలు రద్దుని ఆయన వివరించారు. పలువురు హెచ్‌సీయూ ఎస్‌ఎస్‌యూఐ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి సీఎస్‌ఆర్ నిధులు ఖర్చుచేయాలి

హెచ్‌ఐసీసీలో ఎక్సీడ్ గ్రీన్ ఫ్యూచర్ అవార్డుల కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మాదాపూర్: సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులను విద్య, వైద్యానికి ఖర్చుచేస్తే యువత సరైన మార్గంలో ముందుకెళుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శుక్రవారం ఏక్ కామ్ దేశ్‌కి నామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎక్సీడ్ గ్రీన్ ఫ్యూచర్ ఎన్విరాన్‌మెంట్ హెచ్‌ఆర్, సీఎస్‌ఆర్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థలు సీఎస్‌ఆర్ కింద అందించే నిధులు అట్టడుగు వర్గాలకు, అవసరమైన పేదలకు చేరాలన్నారు. పది మందికి సాయం చేసే అవకాశం కేవలం సంస్థలకు మాత్రమే ఉందని చెప్పారు. వివిధ విభాగాల్లో యూనిట్లు, కంపెనీలకు సంబంధించిన విజేతలకు అవార్డులు అందజేశారు. సెల్కాన్ గ్రూప్ వ్యవస్థాపకుడు గురుస్వామి నాయుడు, ఐపీసీఏ మాజీ డీజీ డాక్టర్ భాస్కర్ ఛటర్జీ తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల తరుణంలో రోగులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న ఆహార నాణ్యతను ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఎం ప్రవీణ, వైద్యులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి కేర్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

రాయదుర్గం: గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బాధితుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన వెంకటేష్ అనారోగ్యంతో గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు చెల్లించారు. శుక్రవారం తెల్లవారు జామున వెంకటేష్ అకస్మాత్తుగా మృతి చెందాడు. అయినా ట్రీట్‌మెంట్ చేశారని రోగి బంధువులు ఆరోపించారు. ఐసీయూ అద్దాలు పగలగొట్టారు. పోలీసుల రాకతో ఉద్రిక్తత సద్దుమణిగింది. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పరామర్శించారు.

పెట్టుబడుల్లో ఆర్థిక వివేకం ఎంతో అవసరం



ఐఎంఎఫ్‌ఐ సీఈ వెంకట నాగేశ్వర్, సూర్యకాంత్‌శర్మకు మెమెంటో అందిస్తున్న ప్రొఫెసర్లు

ఏఎంఎఫ్‌ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్‌నాగేశ్వర్ చలసాని

రాయదుర్గం: పెట్టుబడి కోసం ఆర్థిక వివేకం ఎంతో అవసరమని అందరూ గుర్తించాలని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ నాగేశ్వర చలసాని పేర్కొన్నారు. హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ' ఇన్వెస్టర్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ఆన్ ఫైనాన్షియల్ విజ్‌డమ్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పెట్టుబడుల ఎంపికలో పొదుపు, ప్రణాళిక, పెట్టుబడి పెట్టవలసిన అవసరాన్ని గుర్తించాలని సూచించారు. ఏఎంఎఫ్ఐ సీనియర్ కన్సల్టెంట్ సూర్యకాంత్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులు, పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టడానికి అవకాశం ఉంటే వదులుకోరాదన్నారు. వివిధ మ్యూచువల్ ఫండ్‌ల గురించి వివరించారు. పెట్టుబడి పెట్టడానికి మూడు అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని ముఖ్యంగా పెట్టుబడి అవశ్యకత, పెట్టుబడి భద్రత, వ్యక్తుల లక్ష్యాల గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఇన్‌చార్జ్ ప్రొ.జీవీఆర్‌కే ఆచార్యులు, కార్యక్రమం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఐ.లోకానందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

పటాన్‌చెరు: షీ టీం, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలతో పాటు ముఖ్యమైన హెల్ప్ లైన్ నంబర్లపై మహిళలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిన్నారం ఎస్ఐ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ శక్తి సంకల్ప్ కింద వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా జిన్నారం పరిధిలోని నల్తూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, బాలల హక్కులు, షీ టీం, పోక్సో చట్టం ,సైబర్ నేరాలు, పిల్లల అక్రమ రవాణా, హెల్ప్ లైన్ నంబర్లు (1098,100, 181,112,1930) గురించి అవగాహన కల్పించారు.

మేరుత్సవ్- 2024

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో మేరు ఇంటర్ స్కూల్ ఫెస్ట్ మేరుత్సవ్ 2024ను శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. స్కూల్ వ్యవస్థాపకురాలు మేఘన హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో దక్షిణ భారత్‌లోనే ఇంటర్ స్కూల్ ఫెస్ట్‌లో ఒకటిగా నిలిచిందన్నారు. మేరుత్సవ్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించిన కార్యక్రమానికి 40 స్కూళ్లకు చెందిన 2500 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

మియాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు అసోసియేషన్ల సభ్యులు శుక్రవారం కార్పొరేటర్ శ్రీకాంత్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దేవేందర్‌రావు, దశరథ్, జహంగీర్, గోపాల్‌రెడ్డి, సంతోష్ ముదిరాజ్, ఉమా కిషన్, కృష్ణ, రజనీకాంత్ తదితరులున్నారు.

వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: రంగురంగుల కాటన్, సిల్క్, డిజైనరీ చీరలతో శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన చేనేత ఎగ్జిబిషన్ మహిళలను ఆకట్టుకుంటోంది. శుభకార్యాలు, పండగలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన చీరలు ముఖ్యంగా పటోలా, చెందేరి, పోచంపల్లి, వెంకటగిరి, గద్వాల, బెనారస్, కోల్‌కతా, ఉప్పాడ, ధర్మవరం చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఎగ్జిబిషన్‌ను 70స్టాల్స్‌తో ఏర్పాటు చేశారు. ఈ నెల 5 వరకూ ప్రదర్శన కొనసాగుతుందని సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా నల్లగండ్ల హుడా కాలనీ, ఎపిస్టిమో గ్లోబల్, గుల్‌మొహర్‌పార్కు కాలనీ, బాపునగర్ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

- నల్లగండ్ల హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి 1 గంట వరకు నల్లగండ్ల హుడా కాలనీ, నల్లగండ్ల ఏరియా, రత్నదీప్ సూపర్ మార్కెట్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11 కేవీ ఎపిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3 గంటల వరకు నల్లగండ్ల- తెల్లాపూర్ రోడ్డు, ఎపిస్టిమో స్కూల్ ఏరియా, సాధన స్కూల్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో ..
- 11 కేవీ గుల్‌మొహర్‌పార్కు, బాపూనగర్ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గుల్‌మొహర్‌పార్కు కాలనీ, నేతాజీనగర్, బాపూనగర్, గోపినగర్ లలో విద్యుత్ ఉండదని ఏఈ తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మయూరినగర్ రెడ్డి కాలనీ, ప్రశాంత్‌నగర్ గోకరాజు, బృందావన్ కాలనీ, గౌతమినగర్, రాం నరేష్‌నగర్ ఓహెచ్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు మయూరినగర్ ఎస్‌బీఐ లైన్

- ఉ.11 గంటల నుండి 11.30 గంటల వరకు రెడ్డి కాలనీ, బీకేఎన్‌క్లేవ్ 11..30 నుండి 12 గంటల వరకు ప్రశాంత్‌నగర్, మయూరినగర్ పార్ట్ ప్రజాపతి అపార్ట్‌మెంట్
- మధ్యాహ్నం 12 గంటల నుండి 12.30 వరకు గోకరాజు కళాశాల రోడ్డు, మయూరి నగర్ ఆర్ఎల్ సిటీ రోడ్డు, విజ్ఞాన్ కళాశాల, 1 గంట నుండి 1.30 వరకు నందమూరినగర్, హైదర్‌నగర్, బృందావన్ కాలనీ ,అదేవిధంగా గౌతమీనగర్, శ్రీనివాస కాలనీ



- మధ్యాహ్నం 1.30 నుండి 2 గంటల వరకు రాంనరేష్‌నగర్, ఓల్డే జీహోం, మిత్రహిల్స్, అదేవిధంగా వర్టెక్స్ అపార్ట్‌మెంట్, రాంనరేష్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

దీప్తిశ్రీనగర్, ఆర్టీసీ కాలనీ, ఎస్ఆర్ ఎస్టేట్, దత్త సాయినగర్, స్వర్ణపురి కాలనీ, హెచ్‌ఎంటీ మక్త, బీకే ఎన్‌క్లేవ్, జేపీ నగర్ ఫీడర్ల పరిధిలో..

- ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు విశ్వేశ్వరయ్య కాలనీ, సాయినగర్ కాలనీ, మియాపూర్ పోలీస్ స్టేషన్ రోడ్డు, మదీనాగూడ మెయిన్ రోడ్డు, కృష్ణదేవరాయ కాలనీ, బావార్చి హోటల్ ఏరియా, ఆర్టీసీ కాలనీ, శిల్పాలే అవుట్, బాలాజీ లేఅవుట్
- ఉదయం 11 గంటల నుండి 11.30 గంటల వరకు ఎస్ఆర్ ఎస్టేట్, మియాపూర్ మెయిన్ రోడ్డు, ఫ్రెండ్స్ కాలనీ
- ఉదయం 11.30 నుండి 12 గంటల వరకు మియాపూర్, బాలాజీనగర్, అరబిందో కాలనీ, శ్రీరంగపురం కాలనీ,డీ మార్ట్ ఏరియా
- మధ్యాహ్నం 12 గంటల నుండి 12.30 గంటల వరకు హెచ్‌ఎంటీ కాలనీ, మక్త, స్వర్ణపురి కాలనీ, ఎంఏనగర్, కృషినగర్, స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, ఎలియెన్స్ అపార్ట్‌మెంట్ రోడ్డు, రాఘవేంద్ర పాంచజన్య అపార్ట్‌మెంట్
- మధ్యాహ్నం 12.30 నుండి 1 గంట వరకు జేపీనగర్ మెయిన్ రోడ్డు, జనప్రియ వెస్ట్ సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, మక్త, అదేవిధంగా 1.30 నుండి 3 గంటల వరకు నాగరాజు ఎన్‌క్లేవ్, జేపీ నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్ కుమార్ తెలిపారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్: కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు నెంబర్ 1 నుంచి 10 వరకు, అపర్ణ రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

- సురక్ష కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.00 గంటల వరకు సురక్ష కాలనీ, రాజేంద్రరెడ్డి కాలనీ, పద్మజ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ హిల్ పార్కు తదితర ప్రాంతాలలో..
- మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ధర్మపురి టెంపుల్ రోడ్డు, ఉషోదయ అపార్ట్‌మెంట్, దీప్తిశ్రీనగర్ ప్రాంతాలలో.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- పాపిరెడ్డి కాలనీ, హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రేమ్ నగర్ వెనుక వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపులా.. హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్ నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ప్రాంతాలలో..
- మార్కెట్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 12.00 గంటల నుంచి 12.30 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనుక వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డుకు ఇరువైపుల ప్రాంతాలలో..
- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.30 నుంచి 2.00 గంటల వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, బీహెచ్‌ఈఎల్ హెచ్‌ఐజీ, మైత్రీనగర్ ఫేజ్ 1,2,3 ప్రాంతాలలో..
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు వైశాలి నగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్ రోడ్డు, ఏపీఎన్‌జీఓ కాలనీ ప్రాంతాలలో..

తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- హుడా కాలనీ ఫీడర్ పరిధిలో.. 3.00 గంటల నుంచి సాయంత్రం 04.30 గంటల వరకు చందానగర్ హుడా కాలనీ ప్రాంతాలలో ..
- లింగంపల్లి ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 వరకు లింగంపల్లి మటన్ మార్కెట్, పోలీస్ క్వార్టర్స్, కానుకుంట, వెజిటెబుల్ మార్కెట్, ఎస్ఎం లేఅవుట్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.

హెచ్‌సీయూను సందర్శించిన రవిప్రభు



పొలిటికల్ సైన్స్ విద్యార్థులతో రవిప్రభు

రాయదుర్గం: ప్రపంచంలో అత్యధిక దేశాలు పర్యటించిన వ్యక్తులలో ఒకరిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి రవిప్రభు గుర్తింపు పొందారు. శుక్రవారం ఆయన హెచ్‌సీయూకు వచ్చారు. పొలిటికల్ సైన్స్ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. తన పర్యటన అనుభూతి, వివిధ అంశాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కెకె కైలాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్ షాజీ, పీఆర్ఓ ఆశిష్‌జాకబ్ థామస్ ప్రసంగించారు.

ఫ్రైడే ఫ్యూజన్ ఫీస్టా

చందానగర్: గచ్చిబౌలిలో నిర్వహించిన ఫ్రైడే ఫ్యూజన్ ఫీస్టా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం గచ్చిబౌలిలోని ఎస్‌పీకే భవనంలోని వింధ్యావాణి కేఫ్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఆహారం, ఆభరణాలు, దుస్తులు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, గేమ్స్ స్టాళ్ళు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంది.